


# మానవత చిగురేసింది

- తటవర్తి రామచంద్రరావు

ఉగాది పోటీలో ఎంపికైన కథ

'చదువుకుంటే నీ జీవితమే మారిపోతుంది. కావాలంటే చదువుకుని చూడు' అని ఒకప్పుడు సత్యం మాస్టారంటే సింహాచలం నమ్మలేదు. కాని, ఇప్పుడది తన జీవితంలోకి మంచి మలుపుకి దారితీస్తోంది. అతనికి ఆశ్చర్యంగా, ఆనందంగా వుంది.

పల్లెటూళ్ళో జరుగుబాటు కుదరక పదిహేనేళ్ళనాడు పట్నం వచ్చాడు. నాలుగైదేళ్ళు ఏవేవో కూలి పనులు చేసాడు. ఏదీ కలిసి రాలేదు. చివరకి అద్దె సైకిలు తీసుకొని ఇంటింటికీ పోయి పేపర్లు, గిన్నెలు, ఇనప సామాన్లు పోగేసుకుని వచ్చి పాత సామానుకొట్లో అమ్ముకునేవాడు. మరో ఐదేళ్ళకి అతని జీవితంలో వచ్చిన మార్పల్లా ఇంటింటికీ తిరగనక్కర్లేకుండా మార్కెట్ మొగలో ఒక కొట్టును అద్దెకి తీసుకుని తనే పాత సామాన్ల దుకాణాన్ని పెట్టుకోవటం! వాటిని రీసైక్లింగ్ వాళ్ళకి అమ్ముకుంటూ వచ్చే లాభంతో పెళ్ళాన్ని, ఇద్దరి పిల్లల్నీ పోషించుకుంటున్నాడు.

అద్దె యిల్లు. ఎన్నేళ్ళు గడిచినా గొర్రెకు బెత్తెడు తోక లాంటి ఆదాయం. తను చదువుకోలేదు. చిల్లర పనులు తప్ప తనకేం చేతకావు. పట్నంలో పది మందిని చూసాక ఎంతోమంది తండ్రుల్లాగే తన పిల్లల గురించి గొప్పగా ఊహించాడు. చదువుకున్న పిల్లలకి, చదువుకోని వాళ్ళకీ జీవితాల్లో అంతరాన్ని గుర్తించాడు.

'పిల్లలు ఎదిగొస్తున్నారు. ఎక్కడేనా పనికి కుదిర్చెయ్! నీకు కలిసొస్తుంది'అని కొందరు సలహా ఇచ్చినా డబ్బుకోసం తను ప్రలోభపడలేదు. తన బ్రతుకులా వాళ్ళది దుర్భరం కాకూడదని వాళ్ళని చదివించాలనుకున్నాడు.

యాదృచ్ఛికంగా పాత పేపర్లమ్మటానికి సత్యం మాస్టారు స్వయంగా తన కొట్టుకి రావటం జరిగింది. మాట మీద మాటొచ్చి తన సమస్య ఆయన ముందుంచాడు. కాన్వెంట్లో చదివించాలంటే ఎంత ఖర్చవుతుందని అడిగాడు. సత్యం గారు చెప్పాడు. 'ఎక్కడ చదివినా చదువు చదువే! చదువుకి శ్రద్ధ ప్రధానం'అని చెప్పాడు. 'పరిగెత్తి పాలు తాగొద్దు. నిలబడి నీళ్ళు తాగు' అన్నాడు. ఆయన సలహామేరకు గవర్నమెంటు స్కూల్లో పిల్లల్ని చేర్పించాడు.

పిల్లలు స్కూలుకి వెళ్ళి వస్తున్నారు. కాని, ఎలా చదువుతున్నారో తెల్సుకునేదెలా? ఓరోజున వాళ్ళని మాస్టారింటికి తీసుకువెళ్ళాడు. అక్కడ చాలామంది పిల్లలు ప్రవేటు చెప్పించుకుంటున్నారు. తన మనసులోని మాట చెప్పాడు. మాస్టారు పిల్లల్ని పరీక్షించాడు. వాళ్ళు తెలివైన వాళ్ళే! కాస్త దగ్గరుండి చదివించేవాళ్ళు కావాలి. వాళ్ళని రోజూ ఓ గంటసేపు తన దగ్గరకి పంపమన్నాడాయన.

అప్పట్నించి పిల్లల్ని వెంటబెట్టుకుని మాస్టారింటికి రావటం సింహాచలానికి నిత్యకృత్యమైపోయింది. పిల్లలు చదువుకుంటుండగా మాస్టారి పడక కుర్చీ పక్కన పడున్న పేపర్ని తిరగవేసేవాడు సింహాచలం. ఏవో బొమ్మలు చూడ్డం తప్ప వార్తలేమిటో తనకు తెలిసేవి కావు. పక్క కొట్లవాళ్ళో, తన కొట్టుకు వచ్చే వాళ్ళో చెప్పే వార్తలు తప్ప ప్రపంచంలో మరేం జరుగుతుందో తనకు తెలిసేది కాదు. తెలియనంత కాలం ఏమీ పట్టేది కాదు. కాని, పిల్లలకి మాస్టారు ఎన్నో విడమర్చి చెపుతూంటే తనూ తన పిల్లలకి జీవితానుభవంతో చెప్పాల్సినవి కొన్ని ఉన్నాయన్న సంగతి అతనికి స్ఫురించసాగింది. అయితే, రేపు పైక్లాసులకి వచ్చే పిల్లలకి తనేం చెప్పగలడు?' అని పిల్లలు తుసుక్కున ఒక్క మాటంటే? తనేం కాను? మనసులో ఒక వింతైన భయం పట్టుకుంది...

అక్కడ్నించి పేపర్లో వార్తలేమిటని మాస్టార్ని అడగసాగాడు. ఒకటి రెండుసార్లు చెప్పిన మాస్టారు 'నువ్వు కూడా చదువుకోరాదా? చక్కగా అన్నీ తెలుస్తాయి' అన్నాడు.

"ఈ వయసులో నాకు చదువేంటి మాస్టారూ?"అని మహా సిగ్గుపడిపోయాడు.

"చదువు మొదలుపెట్టటానికి వయస్సుకీ సంబంధం లేదు సింహాచలం!..."

"నేనిప్పుడు అక్షరాలు దిద్దుతుంటే పిల్లలు నవ్వరా?"

"నవ్వనీ! దానివల్ల లాభమే కాని నష్టంలేదు. నీ అంత పెద్దవాడు చదువుకుంటే పిల్లలు పోటీపడి ఇంకా బాగా చదువుతారు. చదువుకుంటే నీ జీవితమే మారిపోతుంది. కావాలంటే చదువుకుని చూడు..."

అదిగో! అప్పుడే మాస్టారు ఆ మాటలన్నది... అంతే, అప్పటికప్పుడు పలక, బలపం పట్టుక్కూర్చున్నాడు. అదేం చిత్రమో! ఇంత కాలంగా తను విన్నవి, మాట్లాడినవి వ్రాసుకుంటూ పోతూంటే, చదువుకుంటుంటే- ఇంత హాయిగా ఉంటుందా- అని ఆనందిస్తూ వ్రాయసాగాడు. ఆరు నెలలు తిరక్కుండా వాక్యాలు వ్రాయటం వచ్చేసింది.

'ఇకనుంచి రోజూ పేపర్ని చదువు. ఎంత అర్ధమైనా మంచిదే!' అని ప్రోత్సహించారు మాస్టారు. మరో ఆరునెల్లు తిరిగేసరికి మాటలు కూడబలుక్కుని చదవటం వచ్చేసింది. ఇప్పుడాయన చెప్పకుండానే మాటలు అర్ధమవుతున్నాయి. వార్తలు తెలుస్తున్నాయి.

ఇదివరకు తన కొట్లోకి వచ్చిన పేపర్లని జీవం లేని లోహ పాత్రలతో సమంగా సంచుల్లో కట్టలుగా పడవేసేవాడు. కాని, ఇప్పుడా పేపర్లనిండా ఎంతో అమూల్యమైన సంపద తొణికిసలాడుతూ కనిపిస్తోంది. దాదాపు ప్రతి పేపర్నీ తిరగేసి ఏదో ఒక వార్త చదవకుండా పాత వాటితో కలపలేకపోతున్నాడు. వాటిలో తనకు తెలుస్తున్న రాజకీయాలే కాదు, వింటున్న వినోద వార్తలే కాదు, ఇంతకు ముందెప్పుడూ వినని విజ్ఞాన విషయాలు కూడా కనిపిస్తున్నాయి. రాత్రి పిల్లలకా సంగతులు చెప్పటం ఎంతో ఆనందంగా

౼ంటోంది. కొద్దోగొప్పో తండ్రి చదువుకున్న వాడయితే ౼ల్లలకెంత లాభిస్తుందో అతనికి స్వానుభవమౌతోంది.

చదువుకోవటం మొదలుపెట్టాక జీవితంలో ఆశ వేరు, అత్యాశ వేరు అని అతనికి అర్థమౌతోంది. అభివృద్ధిలోకి రావటానికి ఆశపడాలి అని అవగతమౌతోంది. ఏదో కూడబెట్టాక అనుభవించాల్సిన అవసరం లేదని అప్పయినాసరే చేసి వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని తోపించింది. ఇలాంటి సాహసాలుచేసి అభివృద్ధిలోకి వచ్చిన వాళ్ళ కథలు పత్రికల్లో కొల్లలుగా కనిపిస్తున్నాయి.

తను కూడా తెగించి ఏదోటి చేయాలనుకున్నాడు. ఎవడో ఓ ఆటోరిక్షాని అమ్మేస్తుంటే అప్పుచేసి కొన్నాడు. దాన్ని బాగుచేయించి అద్దెకి తిప్పనారంభించాడు. ఆరు నెల్లు తిరిగేసరికి అప్పు త్వరల్లోనే తీరిపోతోందన్న ధైర్యం కలిగింది. మళ్ళీ మరో ఆటో అమ్మకానికొస్తే క్షణం కూడా ఆలోచించకుండా కొనేసాడు. అనుకోకుండా తన పాత సామాన్లమీద టర్నోవరు కూడా బాగా పెరిగింది. దీంతో ఆదాయమూ పెరిగింది.

ఓ ఏడాది తిరిగేసరికి తనూ ఓ చిన్న వ్యాపారస్తుడనిపించుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో తను ఉంటున్న వాటాని అమ్మదల్చుకున్నానన్నాడు యజమాని. మరో ఇంటికి వెడితే అద్దె పెరుగుతుంది. ఆ యింటిని తనే ఎందుకు కొనుక్కోకూడదు? సింహాచలానికి ఆ ఆలోచన వచ్చిందే తడవు గతంలో అప్పిచ్చిన మార్వాడీని మళ్ళీ అప్పడిగాడు. తరచుగా అప్పు వసూలు పెడుతున్నాడు. అతనికి మళ్ళీ అప్పు పెట్టటానికి మార్వాడీకి అభ్యంతరం లేకపోయింది. ఆటోలని పెట్టినట్టుగానే ఆ యింటినీ మార్వాడీ దగ్గర తనఖాపెట్టి అప్పు తీసుకున్నాడు.

వ్యాపారంలో ఎప్పుడూ లాభాలే కాదు. ఒకోసారి నష్టాలూ వస్తుంటాయి. ఎంత ఆదాయమొస్తున్నా తన పాత సామాన్ల వ్యాపారం సాగుతున్నా, అనుకోని ఇబ్బందులు అకస్మాత్తుగా వచ్చి పడ్డాయి. పెట్రోలు ధరలు పెరగటంతో ఆటోలమీద లాభం తరిగిపోయింది. తన కొట్టుకి దగ్గర్లోనే మరొకడు పాత సామాన్ల దుకాణం తెరిచాడు. మార్వాడీకి గతంలోలా వెంటవెంటనే వసూలు పెట్టటం కష్టమైపోయింది. చూస్తుండగానే ఇంటి మీద వడ్డీ పెరిగిపోయింది.

ఏదోటి చేసి ఎనభైవేలు తొందర్లో కట్టకపోతే ఇల్లు మార్వాడీ హస్తగతమై పోతుంది. ఈ కష్టాన్ని గట్టెక్కడం ఎలా?...

సరిగ్గా అలాంటి సమయంలోనే అతను పేపర్లో ఒక ప్రకటనని చూసాడు. రెండు కిడ్నీలు పాడయి మృత్యువుతో పోరాడుతున్న ఒకరికి కిడ్నీని ఇచ్చేవారు కావాలని దానికి తగిన ప్రతిఫలం ముడుతుందని ఆ ప్రకటన సారాంశం...

గతంలో విద్యార్థులకి సైన్సు పాఠం చెపుతున్నప్పుడు కళ్ళు, కాళ్ళు, చేతులు, చెవులు, ఊపిరితిత్తులు, కిడ్నీలు... ఇలా ఎన్నో భాగాలు శరీరంలో రెండేసి ఉన్నాయని... వాటిలో ఒకటి పాడయినా మనిషి బ్రతకగలడని... సత్యం మాస్టారు చెపుతుంటే, 'మరది అవిటి బ్రతుకవదా?' అని అనిపించి అమాయకంగా అడిగాడ తను.

'నేను చెప్పేది ప్రాణాపాయముండదని. దేని విషయంలో ఏమయినా కిడ్నీ విషయంలో మనిషిది అవిటి బ్రతుకు కాదు. ఎవరికైనా ఒక కిడ్నీని నిరభ్యంతరంగా దానమిచ్చి ప్రాణాలు కాపాడవచ్చు' అన్నాడు మాస్టారు. ఆ మాటలు గుర్తొచ్చి ఆ ప్రకటనని తీసుకువెళ్ళి మాస్టారికే చూపించాడు సింహాచలం.

అది చదివి "ఏమంటావు?"అని ఆయన అడిగాడు.

"మీరే చెప్పారుగా ఒక కిడ్నీని దానమిచ్చినా మనకేం కాదని."

"అంటే?"

"నాదోటిచ్చి ఒక మనిషి ప్రాణం కాపాడదామని."

మాస్టారు నమ్మలేకపోయారు. ఇంత చిన్న మనిషిలో అంత పెద్ద ఆలోచనా?

"నీకు డబ్బవసరం ఉందా?"

"ఆ మనిషికి రెండు కిడ్నీలు ఉన్నా ప్రాణాలమీదకి వచ్చింది. ఒక్కటే ఉన్నప్పుడు రాకూడదని లేదు కదాండీ! గ్రహచారం చాలకపోతే ముంచుకొచ్చే దాన్ని ఎవరూ ఆపలేరు. కాని, రేపేదో అవుతుందని ఈవేళ చేద్దామనుకున్న మంచి పనిని మానేస్తామా? దయుంచి నాకీ సాయంచేసి పెట్టండి. నాతో వచ్చి మాట్లాడి పెట్టండి."

"పోనీ, అలానే అనుకోండి"అన్నాడు సింహాచలం సిగ్గుపడిపోతూ.

"డబ్బుదేనికి?"

తన అప్పుల సంగతి చెప్పాడు. తనాపని వెంటనే చేయకపోతే ఇల్లు పోతుందన్నాడు. ఈ ఒక్కపనీ చేస్తే తన దరిద్రం తీరిపోతుందన్నాడు. తనకు మరోదారి కనిపించటం లేదన్నాడు.

"బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చావా?"

"అవును మాస్టారూ? ఈ సంగతి ఎవర్తోనూ అనకండి. మా ఆవిడక్కూడా తెలీదు".

"రేపు కర్మకాలి నీ కిడ్నీకేదయినా అయితే..." కేవలం అతన్ని భయపెట్టాలనే ఆమాట అన్నాడు కానీ అతని తెగింపుకి మాస్టారు ఆశ్చర్యంలోంచి తేరుకోలేకపోతున్నాడు.

"ఆ మనిషికి రెండు ఉన్నా ప్రాణాలమీదకి వచ్చింది. ఒక్కటే ఉన్నప్పుడు రాకూడదని లేదు కదాండీ! గ్రహచారం చాలకపోతే ముంచుకొచ్చే దాన్ని ఎవరూ ఆపలేరు. కాని, రేపేదో అవుతుందని ఈవేళ చేద్దామనుకున్న మంచి పనిని మానేస్తామా? దయుంచి నాకీ సాయం చేసి పెట్టండి. నాతో వచ్చి మాట్లాడి పెట్టండి."

మాస్టారికింకేమనటానికీ తోచలేదు. అతని వెంట వెళ్ళకనూ తప్పలేదు.

ఆ అడ్రసు ప్రకారం ఇద్దరూ వాళ్ళింటికి వెళ్ళారు. అదో పెద్ద మేడ. గేటులో ఘూర్ఖా. వాళ్ళ సిరిసంపదలు కొట్టొచ్చినట్టు కనపడుతున్నాయి. పత్రికలో ప్రకటన చూసి వచ్చామని చెప్పారు. ఘూర్ఖా మర్యాదగా లోపలికి తీసుకువెళ్ళి కూర్చోపెట్టాడు. మరి కాసేపటికి ఇంటాయన వచ్చాడు. వాళ్ళనడిగి విషయం తెలుసుకున్నాడు.

"సారీ అండీ! నిన్ననే ఇంకెవరో వచ్చి మాట్లాడి ఒప్పందం చేసుకుని వెళ్ళారు. మా అబ్బాయికి వచ్చేవారమే ఆపరేషన్..."

తనకందవల్సిన పెన్నిధిని ఎవరో తన్నుకుపోయారన్న బాధ సింహాచలానికి కలిగింది.

'దాతలంతమంది ఉన్నారా? మనుషుల అవసరాలు పెరుగుతున్నాయా?' ఏదీ తేల్చుకోలేకపోయాడు మాస్టారు.

"నిరుత్సాహపడకండి. మీలాంటి మంచివాళ్ళ అవసరం ఎంతమందికయినా ఉంది. డాక్టరు పరశురామ్ గార్ని కలవండి. ఆయన ఎవరికి మీవల్ల అవసరముందో చెపుతారు..." అని ఆయన చిరునామా వ్రాసిచ్చాడు.

ఆ అడ్రసు తీసుకుని ఇద్దరూ వెళ్ళారు. డాక్టరు మామూలుగ పేషెంట్లని పరామర్శించినట్టుగానే సింహాచలాన్ని అడిగాడు. డబ్బవసరమున్నట్టు గుర్తించాడు. "నా దగ్గర అర్జంటు కేసొకటుంది. కాని, అతనేమీ పెద్దగా ఇచ్చుకోలేడు మరి..."

ఎంత వచ్చినా తనకిప్పుడు ఫర్వాలేదనిపించింది సింహాచలానికి. "ఆయన ఎవరో చెప్పండి. వెళ్ళి కలుస్తాము."

డాక్టరు, మాస్టారు అతనివైపు ఆశ్చర్యంగా చూసారు.

"డబ్బుకోసం కాదు. మరో మనిషికి సాయపడాలని. అంతే!"

డబ్బవసరమే ప్రధానంగా అతన్నిలా తీసుకువచ్చిందని తనకి తెలుసు. కాని, ఇక్కడికి వచ్చాక ఏదో పూనకం పూనినవాడిలా మాట్లాడుతున్నాడు సింహాచలం. సత్యం మాస్టారికి అతని మాటలు ఆశ్చర్యం కలిగించాయి. 'అవసరంలో ఉన్నవాడు ఏదోటి ఇవ్వకపోతాడా? బడాయి పోతున్నాడేమో!' అని కూడా ఆయనకి అనిపించింది.

"మా సింహాచలం అన్నిటికీ సిద్ధమేనండి" అన్నాడు మాస్టారు కాస్త వత్తి పలుకుతూ.

"సరే, ఎవరి అదృష్టమెలా వుందో ఎవరు చూడొచ్చారు? వెళ్ళిరండి."

డాక్టరు రాసిచ్చిన అడ్రసు ప్రకారం ఇద్దరూ వెళ్ళారు. ఇంతకుముందు వెళ్ళిన మేడ లాంటిది కాదు... సరికదా డాబా కూడా కాదు. ఓ పూరి గుడిసె. తాము తప్పు అడ్రసుకి వచ్చామనుకున్నారు వాళ్ళు మొదట. కాని, అదే యిల్లని సరాసరి ఇంటికి ఇల్లాలే వచ్చి చెప్పింది!

ఏ అదృష్ట దేవతయినా తన తలుపు తట్టకపోతుందా అని ఎదురు చూస్తున్న దానిలా గుమ్మంలోకి వచ్చి వాళ్ళని ఆహ్వానించింది. తానే మృత్యుముఖంలోవున్న వ్యక్తికి నిర్భాగ్యురాలైన భార్యనని చెప్పింది. ఒకప్పుడు డాబా యింట్లోనే ఉండే వాళ్ళమని... తన భర్త ప్రాణాంతకమైన జబ్బు ఇంటినెలా గుల్లచేసిందో ఎక్కడికి తమని తెచ్చి పడవేసిందో చెప్పింది. అతనికేదయినా అయితే తన ఇద్దరి పిల్లల్ని ఎలా పెంచి పెద్ద చేయాలో తెలీని పరిస్థితిలోకి తనని తెచ్చి పడవేసిందని ఎవ్వరైనా ముందుకొచ్చి కిడ్నీని దానంచేస్తే తప్ప తన భర్త బ్రతికి బట్టకట్టడని హృదయ విదారకంగా రోదిస్తూ చెప్పింది.


"ఊర్కోమ్మా! ఊర్కో!..."అని మరేమనాలో తోచక సింహాచలంవైపు చూసాడు సత్యం మాస్టారు.

**(మిగతా 12వ పేజీలో)**

# పాదరక్షల మ్యూజియం!

దేశ దేశాలలో ఎన్నెన్నో వివిధ రకాల మ్యూజియంలు ఉన్నాయి. వాటి గురించి మనం విన్నాం, చూశాం. అయితే కేవలం పాదరక్షలకు ఒక మ్యూజియం ఉన్న సంగతి మనం వినలేదుగదూ!

అవును. అటువంటి మ్యూజియం నిజంగానే ఉంది కెనడాలో. ఆ మ్యూజియం చూడడానికి ఎంతో కుతూహలంతో రోజూ వేలాది మంది వెళ్తూ ఉంటారు. అది పాదరక్షలు పెట్టే ఓ అతి పెద్ద పెట్టె ఆకారంలో నిర్మించబడింది.



కెనడాలోని టొరెంటోలో అతి పెద్ద జనాకర్షణగా నిలిచింది. ఆ అద్భుతమైన భవనాన్ని నిర్మించింది. ప్రపంచ వ్యాప్తంగా గల, మన్నికైన పాదరక్షలు తయారుచేసే 'బాటా' కంపెనీవారు. అది 1995 మే నెలలో ప్రారంభించబడింది. అప్పట్లో 10వేల రకాల పాదరక్షలు ప్రదర్శనకు ఉంచడం జరిగింది. వాటిని ప్రపంచవ్యాప్తంగా 50 సంవత్సరాలుగా సేకరించడం జరిగింది. అక్కడ 450 సంవత్సరాల నాటి పాదరక్షల చరిత్ర కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తుంది.


ఈజిప్ట్‌లో 2500 సంవత్సరాలు నాటి చెక్క చెప్పులతోపాటు, 20వ శతాబ్దపు అత్యాధునిక చెప్పులువరకూ అక్కడ మనల్ని అలరిస్తాయి. అద్భుతమైన పాదరక్షల మ్యూజియం ఒక దానిని నెలకొల్పాలనే తలంపు శ్రీమతి సోన్‌జా బాటాకు కలిగింది. ఆమె స్విట్జర్లాండ్‌లో ఆర్కిటెక్ట్‌లో శిక్షణ పొందింది. థామస్ బాటాతో తన వివాహం పిమ్మట ఆమెకు బూట్లు, చెప్పులు పట్ల ఆసక్తి కలిగింది. చెకోస్లేవేకియాలో బాటా నెలకొల్పిన బాటా కంపెనీని 1945వ సంవత్సరంలో కమ్యూనిస్టులు జాతీయం చేశారు. సోన్‌జాబాటా భర్తకు అండగా నిలబడి తమ ప్రధాన కార్యాలయాన్ని టొరెంటోలో స్థాపించింది.

అచిర కాలంలోనే ప్రపంచమంతటా బాటా కంపెనీ యొక్క అనేక బ్రాంచీలు తెరిచింది. భర్తతో కలిసి ప్రపంచంలోని పలు దేశాలు సంచరించి, ఆయా ప్రదేశాల్లో తనను ఆకర్షించిన, తాను మెచ్చిన అనేక చెప్పులను సేకరించింది. అనేక దేశాల్లోని సాంప్రదాయబద్ధమైన పాదరక్షలు, చిత్ర విచిత్రమైనవి అనేకం ఆమె సమకూర్చగలిగింది. ఆ విధంగా ఆమె సేకరించిన చెప్పులు వేల సంఖ్యలో ఏర్పడ్డాయి.

వాటినన్నిటినీ సోన్‌జా బాటా ఒక మ్యూజియంగా రాయల్ ఒన్‌టోరియో మ్యూజియంకు సమీపంలోగల టొరెంటో విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఏర్పాటుచేసింది. అది 4 అంతస్తులతో రమణీయంగా తీర్చిదిద్దబడింది. అక్కడ పాదరక్షల చరిత్ర, పూర్వీకులు ధరించిన పాదరక్షల నమూనాలు- మనల్ని విశేషంగా ఆకర్షిస్తాయి.

"పాదరక్షలు పూర్వీకుల జీవన విధానాన్ని మనకు తెలియచేస్తాయి. సమాజంలో వారి స్థితిగతులు తేటతెల్లం చేస్తాయి. వారు నివసించిన ప్రదేశాల వాతావరణ స్థితి, వారి కార్యకలాపాలు, మతపరమైన నమ్మకాలు వెల్లడిచేస్తాయి!" అన్నది శ్రీమతి బాటా.

అటువంటి అపురూపమైన మ్యూజియం నెలకొల్పడానికి అనువైన ప్రదేశం లభించడానికి ఆమెకు 15 సంవత్సరాలు కాలం పట్టింది. చివరికి టొరెంటోలో ఆ చోటు సమకూరింది. ఆ మ్యూజియంలో "ఆల్ ఎబౌట్ షూస్"అనే ఒక విభాగం ఉంది. అందులో 4500 సంవత్సరాల పాదరక్షల చరిత్ర మన కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. ఆ చెప్పుల తయారీకి ఉపయోగించిన సామగ్రి అక్కడ కనిపిస్తాయి. మరొక విభాగం "జంటిల్ స్టెప్"అనేది. 19వ శతాబ్దంనాటి మహిళలు ధరించిన పాదరక్షలూ, కాలానుగుణంగా వాటిలో వచ్చిన అందమైన మార్పులు, చేర్పులు మనం అక్కడ గమనించవచ్చును.



ఆ విభాగంలోనే చిన్నారులకు ఆసక్తి కలిగించేవారి చెప్పులతోపాటు, వారికి ఎంతో ఉత్సాహం కలిగించే రంగురంగుల పాదరక్షల బొమ్మలు సహితం ఏర్పాటు చెయ్యబడ్డాయి. వివిధ రంగాలలో పేరుప్రఖ్యాతులు పొందిన వారి పాదరక్షలు సహితం మనం అక్కడ చూడవచ్చును. కవులూ, కళాకారులూ, సినీ తారలు, రాజకీయ ప్రముఖుల చెప్పులు అవి. విన్‌స్టన్ చర్చిల్, ఇందిరాగాంధీ, టెన్నిస్ ఛాంపియన్ జాన్ మెకన్రో, గోల్ఫర్ టైగర్‌ఉడ్‌ల పాదరక్షలు మనల్ని ఆకర్షిస్తాయి. సౌందర్యరాశి యువరాణి డయానా ధరించిన బర్గండే డ్రెస్ పాదరక్షలు మనలో ఎంతో కుతూహలం కలిగించి, ఆమె జ్ఞాపకాలు మనల్ని విచలితులను చేస్తాయి. విక్టోరియా రాణి ధరించిన బాత్‌రూమ్ స్లిప్పర్స్ ముచ్చట గొలుపుతాయి. ఆనాటి పాదరక్షలు తయారుచెయ్యడంలో వినియోగించిన రకరకాల పనిముట్లు, నేటి నవీనయుగంలో ఉపయోగిస్తున్న సామగ్రి, అత్యాధునిక సామగ్రి, యంత్రాలు సహితం ప్రదర్శించబడ్డాయి.

ఈసారి మీరు అమెరికా వెళ్ళినప్పుడు టొరెంటోలోగల "బాటా పాదరక్షలు" మ్యూజియం తప్పక తిలకించండి. అది మీకొక మధురానుభూతిని ఇస్తుంది.

**- కొడిమెల శ్రీరామమూర్తి**

---

**(9వ పేజీ తరువాయి)**

అతని ముఖం కందగడ్డలా ఉంది. "నేను వచ్చిందే అందుకని చెప్పరేమిటి మాస్టారూ!"

అతని కంపిత కంఠానికి చకితుడయ్యాడు ఆయన. ఏ డాక్టరు అక్కడికి వాళ్ళని పంపాడో చెప్పాడు. నర్మగర్భంగా సింహాచలం అవసరాలు కూడా అతన్నక్కడికి రప్పించాయని చెప్పాడు.

ఏమనుకుందో ఆమె గబగబ లోపలికి వెళ్ళింది. రెండు నిమిషాల్లో తిరిగి వచ్చింది. ఆమె చీర చెంగుచాటున ఇదివరకు ఉందో లేదో కాని ఇప్పుడామె ఎద మీద పసుపు కొమ్ము కట్టిన తాడు నిగనిగలాడుతూ కనపడుతోంది!

"... రెక్కాడితే కాని డొక్కాడని బ్రతుకులు మావి. ప్రాణం మీదకొస్తున్నా పనిలోకి వెళ్ళక తప్పటంలేదు ఆయనకి. నేనిప్పుడే పనిచేసి తిరిగొచ్చాను. నేను పైస పైస కూడబెట్టిందంతా ఈ డబ్బాలో వుంది. ఆయన ఆపరేషనుకి ఇది పూర్తిగా సరిపోదు... నా దగ్గరున్న ఈ పుస్తెలొక్కటే! ..." అంటూ తన గుప్పెడు తెరిచింది.

వాళ్ళు అవాక్కయిపోయారు.

"... మీరు చేస్తున్న గొప్ప పనిని చిన్నబుచ్చి దీన్ని ప్రతిఫలంగా తీసుకోమని నేననటంలేదు. కాని, ఏనాటికయినా మీరడిగింది సంపాదించి మీకివ్వగలగాలంటే మా ఆయన ముందు బ్రతికాలి. అందాకా ఈ పుస్తెల్ని మీ దగ్గర అట్టేపెట్టండి. మీరడిగింది ఇచ్చి అప్పుడు వెనక్కి తెచ్చుకుంటాను... నాకేమని మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలీటంలేదు. ఏదయినా తప్పుగా అంటే నన్ను క్షమించండి అన్నయ్యా!"

ఆమెకే కాదు- సింహాచలానిక్కూడా కన్నీళ్ళొచ్చాయి. తన చొక్కా చేతులకి తుడుచుకుంటూ "అన్నయ్యా- అని పిలిచావు. ఇచ్చేవాడే కాని చెల్లెలు దగ్గర్నించి పుచ్చుకునేవాడు అన్నయ్య కాడమ్మా! నేనిక్కడికి డబ్బుకోసం రాలేదని అనను. కాని, నీలాంటి చెల్లెలి అభిమానం దొరికాక నాకీ డబ్బు ఎందుకూ పనికిరానిదిగా కనిపిస్తోంది. మనం మనుషులం. మనం బ్రతికుంటే కదా డబ్బు సంపాదించుకోగలిగేది? ఇప్పుడు కాకపోతే మరో పని చేసి మరొకప్పుడు డబ్బు సంపాదించుకోవచ్చు. కాని, మనిషి ప్రాణం కావాలన్నా దొరుకుతుందా? ముందామనిషిని రక్షించుకోవాలి. మనిషికి మనిషికి తోడుండాలి. లేకపోతే, మనిషి పుట్టుక పుట్టి లాభమేముంది?... అన్నాడు.

తన దగ్గరికి జ్ఞాన బోధకోసం ఒకప్పుడు వటుడిలా వచ్చిన ఈ వామనుడు ఇప్పుడు ఎంత ఎత్తుకి ఎదిగిపోయాడు? తన కన్నీటి పొరలడ్డం వచ్చినందుకు సింహాచలాన్ని కళ్ళారా చూడాలని కళ్ళని, కళ్ళద్దాలని ఒకేసారి ఎలా తుడుచుకోవాలో తెలియక అంతటి మాస్టారూ తొట్రుపాటు పడ్డారు! ★